ధాన్యం సేకరణ కేంద్రాలకే అందించాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - రణస్థలం

ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే రైతులు మిల్లర్లకు ధాన్యం అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మండలంలోని వల్లభరావుపేట, సంచాం, కొండములగాం సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. ఆయా కేంద్రాల సిబ్బందితో ధాన్యం సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక రైతులతో మాట్లాడి ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే ధాన్యం అందిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, మండల వ్యవసాయాధికారి భాస్కరరావు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలు

పరిష్కారమయ్యేనా?

- నత్తనడకన వంశధార, ఆఫ్‌షోర్ పనులు
- కదలిక లేని కరకట్టల పనులు
- ప్రభుత్వాలు మారుతున్నా పరిష్కారం కాని షట్టర్ల సమస్య
- నేడు జెడ్‌పిలో సాగునీటి సలహా మండలి సమావేశం

ఎట్టకేలకు సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే తొలి సమావేశం కావడం గమనార్హం. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సభ్యులు సమావేశం కానున్నారు. జిల్లాలో అనేక సాగునీటి సమస్యలు ముసురుకున్నాయి. వంశధార, ఆఫ్‌షోర్‌లకు బడ్జెట్‌లో కాస్తాకూస్తో నిధులు కేటాయించినా పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. మిగిలిన ప్రాజెక్టులకు సంబంధించి వంశధార, నాగావళి నదుల అనుసంధానం, వంశధార, నాగావళి కరకట్టల పనుల ఊసే కనిపించడం లేదు. జిల్లాలో షట్టర్ల సమస్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా దానికి పరిష్కార మార్గం చూపించలేకపోతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కోటబొమ్మాళి ప్రాంతంలో ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన షట్టర్ల దుస్థితి (ఫైల్)

ప్రభుత్వానికి కొత్త సాగునీటి ప్రాజెక్టులు, పథకాల ప్రారంభంపై ఉన్న శ్రద్ధ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టు పనులు 2005లో ప్రారంభమయ్యాయి. 20 ఏళ్లు అవుతున్నా నేటికీ రైతులకు అందుబాటులోకి రాలేదు. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 94.50 శాతం పనులు చేపట్టారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 2007లో ప్రారంభించారు. 18 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ 38 శాతం పనులే చేపట్టారు. వంశధార-నాగావళి అనుసంధాన పనులను 2017లో మొదలుపెట్టారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా 73 శాతం మేర పూర్తయ్యాయి. ప్రభుత్వాలు మారడం, వాటికి అనుకూలంగా ఉన్న నిర్మాణ సంస్థలకు సవరించిన అంచనా వ్యయంతో పనులు అప్పగించడం చేస్తూనే ఉన్నారు. అంతకంతకూ పెరుగుతున్న అంచనా వ్యయంతో ప్రజల డబ్బు వృథా అవుతోంది తప్ప పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకం ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉంది. పనులు మొదలుపెట్టిన రెండేళ్లలో 45 శాతమే పూర్తయిన నేపథ్యంలో మరో నాలుగు నెలల్లో మిగిలిన పనిని ఏ మేరకు పూర్తి చేయనున్నారో చూడాల్సి ఉంది.

కదలిక లేని కరకట్టల పనులు

2007-08లో ప్రారంభమైన వంశధార కరకట్టలకు సంబంధించి నాలుగు ప్యాకేజీల పనులు 5.66 శాతం నుంచి 21.34 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నాగావళి కరకట్టల పనులు 33.32 శాతం పూర్తయ్యాయి. నిర్మాణ సంస్థలు 2010 నుంచి పనులను ఆపేశాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం, కొత్తగా టెండర్లను పిలిచి కొత్త నిర్మాణ సంస్థలకు పనులను అప్పగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉన్నపళంగా పనులను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టల నిర్మాణానికి రూ.13.5 కోట్లు వంశధారపై 23 కి.మీ మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.130 కోట్లు అవసరమని ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదన అటకెక్కాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా దాని ఊసే ఎత్తడం లేదు.

నత్తనడకన అనుసంధానం పనులు

వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులకు రూ.78.96 కోట్లు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం మార్చి 27, 2017లో పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ప్రాజెక్టు పనులను నెల్లూరుకు చెందిన పి.వి రమణయ్య అండ్ కంపెనీకి రూ.57.99 కోట్లకు పనులను అప్పగించింది. అనుసంధాన పనులు 2020 నాటికే పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 73 శాతం పనులే చేపట్టారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం డబ్బులు, కాంట్రాక్టర్‌కు బిల్లుల బకాయిలు తేలిస్తే పనులు ముందుకు సాగే అవకాశమున్నా, ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించలేదు.

అటకెక్కిన ఆధునీకరణ పనులు

వంశధార ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాలువలు ఆధునీకరణ పనులకు నోచుకోలేదు. ప్రధానంగా ఎడమ కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. ఎడమ కాలువ సామర్థ్యం 2,400 క్యూసెక్కులు కాగా, బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1600 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆధునీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో 18.45 కోట్లతో అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఏళ్ల తరబడి అపరిష్కృతంగానే షట్టర్ల సమస్య

వంశధార శివారు భూముల సాగునీటికి షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకి మారింది. షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన సాగి 13 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. గతంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షా సమావేశం ఇతర సందర్భాల్లో జలవనరులశాఖ అధికారులు పలు పర్యాయాలు ప్రస్తావిస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, విఆర్‌ఎలు

పే స్కేల్ అమలు చేయాలి

కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన విఆర్‌ఎలకు విఆర్ఒ, అటెండర్ ఉద్యోగోన్నతులు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎలు నగరంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు శుక్రవారం ప్రదర్శన నిర్వహించిన అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఆర్‌ఎలకు తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేల్ జీతాలు చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న విఆర్ఒ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ తదితర పోస్టులు అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం విఆర్‌ఎల సమస్యలు పరిష్కరిస్తుందని విఆర్‌ఎలందరూ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు ఉన్న సమయంలో విఆర్‌ఎల ధర్నాలో పాల్గొని అధికారంలోకొస్తే విఆర్‌ఎల జీతాన్ని రూ.15 వేలకు పెంచుతామని ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో విఆర్‌ఎలకు ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగలేదని, రూ.10,500తో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నా, అర్హులైన విఆర్‌ఎలకు ప్రమోషనన్స్ ఇచ్చి భర్తీ చేయడం లేదన్నారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి లక్ష్మణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నాయకులు ఎన్.సీతప్పడు, డి.అప్పారావు, కె.కృష్ణ, బి.రాములమ్మ, మీనాక్షి, పద్మావతి, పి.అప్పలస్వామి, లోకనాథం పాల్గొన్నారు.

నిర్బంధాన్ని ఎత్తివేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ నిర్బంధాన్ని ఎత్తివేయాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాసరావుకి వామపక్ష నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రదర్శనలు, ధర్నాలకు అనుమతులు నిరాకరించడాన్ని నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానాన్ని ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిర్బంధాన్ని ఎత్తివేసి ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ పవర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని కోరుతూ ధర్నాలు చేయడానికి ప్రభుత్వం అనుమతులు నిరాకరించడాన్ని గుర్తు చేశారు. సభలు, సమావేశాలకు అనుమతులు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్రం, సభలు, సమావేశాలు నిర్వహించుకునే హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించే హక్కులు కాలరాస్తే అందుకు తగ్గ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం గౌరవించాలన్నారు.

ఎఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రథసప్తమికి పటిష్ట ఏర్పాట్లు

- ఏడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి మహోత్సవ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రథసప్తమి ఏర్పాట్లపై ఉన్నతస్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాల్లో యాత్రికుల సౌకర్యార్థం పటిష్టమైన క్యూలైన్ల ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏడు రోజుల పాటు రోజూ ఆస్థాన సేవ, తిరువీధి, స్వామి అలంకరణ, లక్షపుష్పార్చన, సూర్య నమస్కారాలు వంటి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. యాత్రికుల భద్ర దృష్ట్యా క్యూలైన్లలో సిసి కెమెరాలు, స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు. వాలంటీర్లు, పోలీస్‌శాఖ పర్యవేక్షణ తప్పనిసరని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దాతలు సమకూర్చే ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలని ఆదేశించారు. సమావేశంలో నమూనా శకటాలు, దేవాదాయశాఖ తరుపున ఏర్పాట్లు, దాతల టిక్కెట్ల కేటాయింపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎగ్జిబిషన్ స్టాల్లు, ఫుడ్ కోర్టులు, సైనేజ్ బోర్డులు, ఇన్విటేషన్ పంపిణీ, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణకు సంబంధించి అధికారులను నామినేట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్‌కుమార్, డిఆర్ఒ లక్ష్మణమూర్తి, శ్రీకాకుళం ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష, డిఎస్‌పి వివేకానంద, డిఎంహెచ్ఒ అనిత, సుడా ఇఇ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యారోగ్యశాఖ అధికారులు, జిల్లాలోని ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులు పూర్తిగా జ్వరం తగ్గని వారు స్క్రబ్ టైఫస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. 'చిగ్గర్ మైట్' అనే కీటకం కుట్టడం ద్వారా ఈ వ్యాధి మనుషులకు సోకుతుందని తెలిపారు. దీనిపై ప్రజలు భయభ్రాంతులకు గురికావాల్సిన అవసరం లేదని, వ్యాధి నిర్ధారణకు సరిపడా కిట్‌లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడే ప్రైవేట్ ల్యాబ్‌లు పరీక్షల ధరలను నిర్ధారించాలని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత మాట్లాడుతూ పొదలు, గడ్డి, పొలాలు, అడవి ప్రాంతాల్లో ఉండే చిగ్గర్లు కుట్టడం వల్ల వస్తుందని, వ్యవసాయ పనులు చేసేవారు, పశువుల పాకల్లో తిరిగే వారికి ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, శరీర బలహీనత, వాంతులు ఈ వ్యాధి లక్షణాలుగా ఉంటాయని వివరించారు. పొలాలు, పొదల్లో పనిచేసేటప్పుడు శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, చేతులు, కాళ్లపై కీటక నాశక లోషన్ ఉపయోగించాలని సూచించారు. స్క్రబ్ టైఫస్‌కు సమర్థవంతమైన చికిత్స ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉందన్నారు. జ్వరం, శరీర బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పిహెచ్‌సి గానీ ప్రభుత్వాస్పత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. ముందుగానే చికిత్స ప్రారంభిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ కళ్యాణ్‌బాబు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విభాగాధిపతులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు

మెగా పేరెంట్, టీచర్స్ డేలో మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగవుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విద్యతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం మెగా పేరెంట్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. అభ్యసన ఫలితాలే లక్ష్యంగా పాఠశాల విద్యలో నూతన సంస్కరణలు తీసుకురాబోతున్నామని ప్రకటించారు. మెగా డిఎస్‌సి ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత కారణంగా అవి మళ్లీ తెరుచుకుంటున్నాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపొందుతున్నాయన్నారు. రూ.నాలుగు వేల కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మమేకమై వారి ప్రగతి నివేదికలు, విద్యా ప్రమాణాలను వ్యక్తిగతంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో ఉన్న వసతులు, బోధన నాణ్యత, మధ్యాహ్న భోజన ప్రమాణాలపై చర్చించిన మంత్రి... వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్, ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్, ఆర్‌డిఒ కృష్ణమూర్తి, ఎంఇఒలు డి.తులసీరావు రెడ్డి, డి.చిన్నారావు, పాఠశాల హెచ్‌ఎం బి.ఈశ్వరమ్మ, ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

విద్యారంగ, విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటమే లక్ష్యంగా భారత విద్యార్థి ఫెడరేషన్ పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహనరావు అన్నారు. నగరంలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ 44 జిల్లా మహాసభ శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఏర్పడిన పుటి నుంచి విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. నూతన విద్యావిధానం రద్దు చేసే వరకూ పోరాడుతామని తీర్మానించించారు. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యా సంస్థలకు వెళ్లేందుకు విద్యార్థి సంఘాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలన్నారు. విద్యార్థినుల వసతిగృహాల్లో శానిటరీ నాఫ్‌కిన్స్ సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు భవనాలు, మౌలిక వసతులు కల్పించాలన్నారు. పొందూరు, పలాస డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్ నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనుమతులు లేకుండా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లపై కళాశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న రామ్మోహనరావు

నూతన కమిటీ ఎన్నిక

కార్యక్రమం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శులుగా డి.చందు పి.కగేష్, జిల్లా మహిళా కన్వీనర్‌గా దివ్య, కార్యవర్గ సభ్యులుగా చిన్న దుర్గాప్రసాద్, జె.రాము, 14 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ నెల 12వ నుంచి 15 తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రైవేటీకరణను విడనాడాలి

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర డాక్టర్ వింగ్ అధ్యక్షులు సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.3 లక్షల కోట్లు అప్పు చేయడం విధ్వంసం అన్న సిఎం చంద్రబాబు, 16 నెలల్లో రూ.2.50 లక్షలు కోట్లు అప్పు చేయడం ఏమనాలని ప్రశ్నించారు. రూ.లక్షల కోట్లు అప్పు చేస్తున్న ప్రభుత్వం రూ.5 వేల కోట్లతో మెడికల్ కళాశాలలు నిర్మించ లేరా? అని ప్రశ్నించారు. మెడికల్ పీజీ సీటు రూ.29 లక్షలుగా నిర్ణయించడం అన్యాయన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు మెడికల్ కళాశాలలు అప్పగించి, బోధనా సిబ్బందికి ప్రభుత్వం జీతం చెల్లిస్తుందని అనడం అనాలోచిత చర్యగా చెప్పారు. స్థల కేటాయింపులు, కేంద్ర ప్రభుత్వం సంస్థల పెట్టుబడులు ఒప్పందాలు సైతం గత ప్రభుత్వం పూర్తి చేసిందేనని అన్నారు. ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు.

'పది' విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

- నేటి నుంచి అమలు
- ఆదివారాల్లో ఒక్కపూట స్కూల్
- అమలు పర్యవేక్షణకు కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి ఫలితాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో జిల్లా విద్యాశాఖ రూపొందించిన వంద రోజులు ప్రణాళిక శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు కానుంది. మార్చి 16 నుంచి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు అనువుగా ఉండేందుకు వీలుగా ఈ వంద రోజుల ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో 450 ఉన్నత పాఠశాలల నుంచి 21,381 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరుకానున్నారు. 196 ప్రయివేట్ పాఠశాలల నుంచి 7,589 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. రెండో శనివారాలు సెలవు దినం కూడా ప్రకటన చేస్తూనే ఆదివారం ఒక్కపూట మాత్రమే తరగతులు నిర్వహణ జరిగేలా ప్రణాళిక తయారు చేశారు. రోజుకు నాలుగు సబ్జెక్టులు బోధన జరిగేలా కాల నిర్ణయ పట్టిక రూపొందించారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్‌లు పూర్తయిన నేపథ్యంలో ఒక్కో సబ్జెక్టుకు 90 నిమిషాల సమయం కేటాయించారు. ప్రణాళిక ప్రకారం కేటాయించిన సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో చదివించి, వాటిపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తారు. అనంతరం పరీక్ష నిర్వహణ చేపట్టి విద్యార్థుల్లోని తప్పిదాలను సవరిస్తూ... పరీక్షలకు సిద్ధం చేయనున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇప్పటికే మార్గదర్శకాలను విడుదల చేశారు. అన్ని సబ్జెక్టులకు గాను ఉపాధ్యాయులు చేపట్టాల్సిన చర్యలు గూరించి మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ మేరకు శనివారం నుంచి ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ చదువుతున్న పదో తరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అవసరమైన వంద రోజుల ప్రణాళిక అమలు కానుంది. గడచిన రెండేళ్ల క్రితం నుంచి అమలు అవుతుంది. ఈ వంద రోజుల ప్రణాళిక పటిష్టంగా అమలుచేసే క్రమంలో ఉపాధ్యాయుల పనితీరుపైనా పర్యవేక్షణ ఉంటుంది.

CHANGE OF NAME

I, **Madhusudhna Rao** legally father of No 15705840H Rank Hav Name Chandrasekhar Pedada Unit 10 EW Bn, C/o 56 APO permanent resident of Korlakota village and Post, Amadalavala, Srikakulam, State Andhra Pradesh 532185 that I have changed my name from **Madhusudhna Rao** to **Pedada Madhusudhnarao** and amendment of date of birth from 01-07-1964 to 21-05-1952 vide affidavit dated 25-11-2025 before the court of Amadalavala.

పండగలా పేరెంట్స్ మీటింగ్

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న విప్ అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని ధర్మపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.విశ్వనాథం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నామన్నారు. నిష్ణాతులు అధ్యాపకులతో ఉత్తమ బోధన అందిస్తున్న దని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, జన సేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఆర్‌డి ప్లాంటేషన్ డైరెక్టర్ దినేష్ కుమార్, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ ప్రభాకర రావు, ఎంఇఒ కె.అప్పారావు, టిడిపి నాయకులు డిల్లీరావు, డి. కామే శ్వరరావు, బి.రాజేంద్రప్రసాద్, దుర్యోధన, పరశురాం, హేమ రాజు, సారథి, పోలయ్య, తులసయ్య, కిరణ్ పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, ఆడపా చంద్రశేఖర్, పిఎసిఎస్ చైర్మన్ బైరి భాస్కరరావు, రావాడ కృష్ణారావు, డిటి శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.రవికుమార్, వ్యవసాయశాఖ ఎడి ఎల్.వి.మధు, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

పలాస : విద్యతో పాటు విద్యార్థులు నైపుణ్యతను పెంపుచేసుకొనే ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ డేలో పాల్గొని మాట్లాడారు. అనంతరం పాఠశాల విద్యార్థిని ఎమ్మెల్యే శిరీష చిత్రపటాన్ని వేసి బహుమతిగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వరరావు పండా, ఎంఎసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దువ్వాడ కృష్ణమూర్తి, టిడిపి మండ ల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, పిఎసిఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, వజ్జ బాబూరావు, ఆనంద్, సుదర్శన్, మురళీ కృష్ణ, సింహాచలం, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, ఎంపి డిఒ కె.వసంతకుమార్, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో ప్రిన్సిపాల్ జి.ధనుంజయరావు, ఉన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు ఎ.గోవిందరావు, మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు డి.ఎల్.నరసింహం పాల్గొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో థింసా నృత్యం, తప్పెట గుళ్ళ నృత్యం చేసి సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, డిటి మురళీకృష్ణ, వైద్యులు పి.ప్రసన్న కుమార్, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, సర్పంచ్‌లు పి.కృష్ణవేణి, ఎల్.భగవాన్‌దాస్‌నాయుడు, విశ్రాంత హెచ్ఎం ఎద్దు దాసునాయుడు పాల్గొన్నారు.

నరసన్నపేట : రావులవలసలో మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఎంఇఒ-2 పేడాడ దాలినాయుడు, ప్రధానోపా ధ్యాయుడు పద్మజ, బి.శ్రీరామమూర్తి, ఎం.లక్ష్మీనారాయణ, కె.పావని, ఎం.రాంబాబు, ఎస్ఎంసి చైర్మన్ చంద్ర భూషణ్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు ఎస్.మోహనరావు, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎంఇఒలు ఎ.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన పిపిఎం కార్యక్రమంలో కళింగవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, ప్రిన్సిపాల్ అరంగి మల్లేశ్వరరావు, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లి, రావివలస, తలగాం ఎట్, నౌపడ ఆర్ఎస్, చాకపల్లి, సీతాపురం, లింగాలవలస, పోలవరం ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ డేలో టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్, ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బూర్జ: ప్రపంచానికి నైపుణ్యత కలిగిన యువతను అందించడమే సిఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొల్లివలస కెజిబివి పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్, సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు వి.సీతారాం బాబు నాయుడు, ఎస్ఎంసి చైర్మన్ ఎన్.వాసు, తహశీల్దార్ వై.వి.పద్మావతి, ఎంపిడిఒ తిరుపతిరావు, ఎస్ఒ గాయత్రితో పాటు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహణ అవశ్యకత, ముఖ్య ఉద్దేశ్యంపై చర్చించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు చదువులో ఆసక్తిని పెంచుకోవాలని, నూతన ప్రయోగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

లావేరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పసుపులు జగన్నాథం అధ్యక్షతన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లంకలపల్లి రాంబాబు, వైస్ చైర్మన్ ధోర సుశీల, మాజీ ఎఎంసి చైర్మన్ ఇనపకుర్తి తోటయ్య దొర, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్ జి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, ఎంఇఒ మజ్జి మురళీకృష్ణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని పాతర్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి అక్కడున్న దేశ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ అవినాష్, బిసి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గురజాపు రాము, పిన్నింటి బానోజీ నాయుడు, బస్వా గోవిందరెడ్డి, అనంత్ మహంతి, దన్నాన రవీంద్ర, మైలపల్లి పోలీస్, సుంకర ధనుంజయ్, తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత పాల్గొన్నారు. అలాగే మండలంలోని తొగరాంలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు. మండలంలోని కొర్లకోటలో నారాయణ పురం ఆనకట్ట చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు, కనుగుల వలసలో టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కోర్లకోట సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పల నాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యాం సుందర్, జె.రవి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జి.సిగడాం రూరల్ : మండలంలోని సంతవురిటి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ఈశ్వరరావు పాల్గొన్నారు. మహాత్మగాంధీ, సరస్వతి దేవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవి, ఎఎంసి ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, నక్క మురళీ, వజ్జపర్తి రఘురాం, సర్పంచ్ సాకేటి నాగరాజు, ముద్దాడ తహశీల్దార్, ఎం.సరిత, ఎంపిడిఒ జి.రామకృష్ణారావు, ఎంఇఒ అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఎఒ బి.బాజ్జి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలాస : ఎమ్మెల్యే చిత్రపటాన్ని అందజేస్తున్న విద్యార్థిని

పొందూరు: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లోలుగు కెజిబివి, ఎపి మోడల్ స్కూల్స్‌లో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ఎంఇఒలు ఎం.వాగ్దేవి, పి.రాజారావులు పాల్గొన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, బలగ శంకర భాస్కరరావు, బాడాన శేషగిరి నాయుడు, కొంచాడ చిన్నం నాయుడు, ప్రిన్సిపాళ్లు హెచ్.ప్రభాకర్, సిహెచ్.లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: పట్టణంలోని ఎవిఎన్ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

అలాగే స్థానిక రెల్లవీధి మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో ముఖ్య అతిథిగా లయన్ కరణం శోభారాణి పాల్గొన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా లయన్ కరణం హారికాప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని కిష్టప్పపేట జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి, తెలుగు మహిళా అధ్యక్షులు జి.స్వాతి హాజరయ్యారు. మహాత్మ గాంధీ, సరస్వతి దేవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరసవిల్లి సత్యవతి, హెచ్ఎం సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో జనసేన మండల అధ్యక్షులు, పిఎసిఎస్ డైరెక్టర్ పైడి మురళి మోహన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిల్లి సిద్దార్థ, లక్ష్మి, గోవింద, ఉప సర్పంచ్ నరసింహ అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి కడియాల పద్మాప్రకాష్, తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ త్రినాథరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి పాల్గొన్నారు.

పోలాకి : విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కొత్తూరు : థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బూర్జ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నిరసన తెలియజేస్తున్న పోరాట కమిటీ నాయకులు, మహిళలు

థర్మల్ పవర్‌ప్లాంట్ రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి- బూర్జ

థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదనలు రద్దు చేయాలని మండలంలోని జె.వి.పురం గ్రామంలో గ్రామస్తులు నిరసన తెలిపారు. శుక్రవారం మహిళలు ఇందుకు సంబంధించిన ప్రతులను దగ్ధం చేశారు. ఈ ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్లు ప్రకటన ఇచ్చేంత వరకు తాము పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని మోసపూరిత మాటలు చెప్పినా తాము వెనకాడబోమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి గిరిజనుల మనుగడను దెబ్బతీసే థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతిపాదనను తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సవర సింహాచలం, సవర సీతారాం, కళ్లేపల్లి రమణ, గోపాలరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఎల్.డి.పేట పాఠశాలలో యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక రాష్ట్ర కౌన్సిలర్ బల్లా చిట్టిబాబు, జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. గౌరవాధ్యక్షునిగా మైలపల్లి శ్రీనివాసరావు, అధ్యక్షునిగా రత్నాల సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చౌక్కార ధర్మారావు, మహిళా కార్యదర్శిగా కింతలి సుజాత, ఉపాధ్యక్షునిగా బొత్స శోభారాణి, అంబలి తిరుపతిరావు, ఆర్థిక కార్యదర్శిగా అర్జీ లోకనాథం, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.ధనుంజయరావు, అకడమిక్ కన్వీనర్‌గా అంజన్‌కుమార్, కార్యదర్శు లుగా సింహాచలం, ఢిల్లేశ్వరరావు, జనార్ధనరావు, సత్యవతి, జిల్లా కౌన్సిల ర్‌గా జయరాం, శరత్‌కుమార్, తిరుపతిరావు, సుందరరావు, శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పాఠశాలల పరిరక్షణకు నిరంతరం పాటుపడాలన్నారు. ఉపాధ్యాయులపై అనవసర ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.


పరిశీలిస్తున్న ఎస్ఇ వీరనాయుడు

రోడ్లు, కాలువలు నిర్మించాలి

పలాస: మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితుల కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఇ కె.వీరనాయుడు అధికారులకు ఆదేశించారు. మండలంలోని రామ కృష్ణాపురం, గోపీవల్లభపురం, ఆర్అండ్ఆర్ కాలనీలను తన బృందంతో శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెపండగా 2.0 కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లు, కాలువలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో కూటమి నాయకులు, పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని, ముందుగా చేసిన పనులకు సంబంధించి బిల్లులు సిద్ధం చేయాలన్నారు. ఆయనతో డిఇ గొర్రెల రవిబాబు, ఎఇ నాగభూషణ్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని రాజపురం సబ్ స్టేషన్ పరిధిలోని భైరిపురం 11 కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ పనులు నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున వింధ్యగిరి, భైరిపురం గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఉత్తరాంధ్ర రైఫిల్స్ షూటింగ్ పోటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి హరీష్ రైఫిల్స్ షూటింగ్ అకాడమీ ఈనెల ఏడో తేదీన శ్రీకాకుళంలో మాతృదేవోభవ ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు పిల్లల తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఆరో తేదీ నుంచి పోటీ దారులు వారి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు వారికి మెడల్స్, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ఉంటుందని తెలిపారు. 8332913810 ఫోన్ నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

లోకేష్‌ను కలిసిన 'లోతుగెడ్డ'

ప్రజాశక్తి- కొత్తూరు

లోకేష్‌తో లోతుగెడ్డ

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి, టిడిపి నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మండలం భగవాన్‌పురంలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులకు శక్తి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భగవాన్‌పురం ప్రాథమిక పాఠశాలలో పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు శక్తి యాప్ ఉపయోగాలను వివరించి డౌన్‌లోడ్ చేయించారు. మహిళా బాలిక సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీతో శక్తియాప్ రూపొందించిందని టీం ఇన్‌ఛార్జి గిరిధర్ తెలియజేశారు. ఫోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

చదువుపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని పూర్వ ప్రిన్సిపాల్ కిమిడి జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఎస్ఎం పురంలో గల ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసి కమిటీ చైర్మన్ నర్సింగరావు, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రణస్థలం: రణస్థలం ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా యూనిట్ అధ్యక్షులుగా లోపింటి మధుసూధనరావు, సీనియర్ అకౌంటెంట్, సబ్‌ట్రెజరీ, రణస్థలం కార్యదర్శిగా ఎల్. ఆదినారాయణ, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ సమతారానా, సబ్‌ట్రెజరీ అధికారి, రణస్థలం ట్రెజరర్‌గా బి.గిరీష్ కుమార్ ఎన్నికయ్యారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ కార్యవర్గ ఎన్నికలు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగాయి. ఎన్నికలకు ముఖ్య అతిథిగా జెఎసి చైర్మన్, జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు హనుమంతు సాయిరాం, జిల్లా జనరల్ సెక్రెటరీ చల్లా శ్రీనివాస్, ఆర్.వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా టి.సోమేశ్వరరావు వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో జరిపించారు. జిల్లా నాయకులు బొత్స శ్రీనివాసరావు, టౌన్ ప్రెసిడెంట్ డి. రాజ్ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎ.రాధాకృష్ణ, జిల్లా జాయింట్ సెక్రటరీ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

పొందూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ పొందూరు తాలూకా యూనిట్ ఎన్నికను నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా డిప్యూటీ ఎంపిడిఒ డి.అప్పన్న, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం. శ్రీనివాస్, సెక్రటరీగా పి.నర్సునాయుడును ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా జె.పవన్‌కుమార్, ఎం. నర్సింహులు, జి.మధు సూదనరావు, జాయింట్ సెక్రటరీలుగా పి.మణి ప్రసాద్, ఇ.సాయిబాబు, జి.మహేశ్వరరావు, ఎస్.లక్ష్మీ, ట్రెజరర్‌గా పి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎన్‌జిఒ జిల్లా ప్రెసిడెంట్ బి.పూర్ణచంద్రరావు వ్యవహరించారు. ఎన్నికైన సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

పొందూరు : ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

చర్చలకు రైతులు సహకరించాలి

కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉద్దానం తీరప్రాంతంలో అత్యాధునిక ఎయిర్‌పోర్టు నిర్మాణం చేయనున్నట్లు ఎయిర్‌పోర్టు ప్రత్యేక అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మొత్తం 1200 ఎకరాలు వరకు స్థలం సేకరణకు నిర్ణయించామన్నారు. అందులో ప్రభుత్వ భూమి 200 వందల ఎకరాలు వరకు ఉందని చెప్పారు. అయితే ప్రభుత్వ భూమి ఆధీనంలో ఉన్న రైతులకు జిరాయితీ రైతులతో సమానంగా పరిహారం అందించనున్నట్లు చెప్పారు. మండలంలో మోట్టూరు పంచాయతీ నుంచి 150 ఎకరాలు, చీపురపల్లి పంచాయతీ నుంచి 317 ఎకరాలు రైతుల నుంచి సేకరించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహశీల్దార్ బి.వి.సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వంశధార నిర్వాసితులకు 2023 ఆగస్టు10న ప్రాజెక్టులపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండల కేంద్రంలో సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చినహామీ ఎందుకు నిలబెట్టుకోలేదో నిర్వాసితులకు సమాధా నం చెప్పాలని ప్రాజెక్టుల నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో ప్రాజెక్టులపై యుద్ధబేరి కార్యక్రమంలో భాగంగా ఆనాటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు కొత్తూరు మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహిస్తూ రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే వంశధార నిర్వాసితులకు స్పెషల్ ప్యాకేజీ ప్రకటించి అందరికీ న్యాయం చేస్తానని కొత్తూరులో ప్రజలందరి సమక్షంలో ఇచ్చిన హామీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పడం వెన్నతో నేర్పిన విద్యని అందులో భాగంగానే వంశధార నిర్వాసితులకు అబద్ధాలు చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.6 లక్షలు ఇస్తానని మీరు చెప్పిన మాటలు నిర్వాసితులు మర్చిపోలేదని ఆయన గుర్తు చేశారు.

శబరిమలలో జిల్లావాసి మృతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం రూరల్

వరహానరసింహులు (ఫైల్)

కేరళలోని శబరిమలకు అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లిన మండలంలోని రాగోలు పంచాయతీ పరిధి కూటి కుప్పలవానిపేటకు చెందిన గురుస్వామి గురుగుబెల్లి వరహా నరసింహులు (72) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. అక్టోబరులో అదే గ్రామానికి చెందిన నలుగురు అయ్యప్ప మాల ధరించారు. వారితో పాటు మరో ముగ్గురు కలిసి ఈనెల మూడో తేదీన శబరిమల దర్శనానికి వెళ్లారు. శుక్రవారం వేకువజామున శబరిమల కొండ చేరుకున్న తర్వాత వరహానరసింహులుకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. సమీపంలోని ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. 1993 నుంచి మాలాధారణ వేస్తూ గురుస్వామిగా పరిసర ప్రాంతాల్లో పేరొందిన ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూడు ఇళ్లలో చోరీ

భయాందోళనలో పట్టణవాసులు

పొందూరు: పట్టణంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఒకేసారి మూడు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి పట్టణ ప్రజల్లో దొంగలు భయాందోళనలను రేకెత్తించారు. పోలీసులు, స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని గాంధీనగర్-1లోని మాడుగల లక్ష్మి, గాంధీనగర్-2లో ఎచ్చెర్ల పైడిరాజు, పేకల లక్ష్మి ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. మాడుగల లక్ష్మీ తన భర్త అనారోగ్యం కారణంగా వైద్యం కోసం కుటుంబంతో కలిసి కొద్ది రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లారు. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి ఉన్న తాళాన్ని పగులుగొట్టి ఇంట్లోని బీరువాలో తులం బాంగారం చైన్, రూ.లక్ష నగదు, పలు వెండి వస్తువులను చోరీ చేశారు. అలాగే ఎచ్చెర్ల పైడిరాజు కటుంబసభ్యులు ఇంటికి తాళం వేసుకుని విశాఖపట్నంలోని ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వీరి ఇంటి తాళాన్ని విరగగొట్టి బీరువాలో ఉన్న అరతులం బంగారం, ఏడుతులాల వెండి వస్తువులను దోచుకుపోయారు. అలాగే పేకల లక్ష్మీ హైదరాబాద్‌లో తన కుమారిడి దగ్గరికి కొద్ది రోజులు క్రితం వెళ్లారు. ఆమె ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో సమీపంలోని బంధువులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె వస్తే ఇంట్లో ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయో తెలియాల్సి ఉంది. చోరీల విషయం పోలీసులకు తెలియడంతో వెంటనే శ్రీకాకుళం క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్‌టీం చోరీలకు గురైన ఇళ్లకు చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించడంతో పాటు వేలిముద్రలను సేకరించారు. చోరీ జరిగిన ఇళ్లకు సమీపంలో గల కేమెరాలను పోలీసులు పరిశీలించారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

పట్టణంలో అలజడి

పట్టణంలోని పలు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయంటూ ప్రచారం కావడంతో పట్టణ ప్రజల్లో భయాందోళనలు చెలరేగాయి. కొంతకాలంగా పట్టణంలో ఎటువంటి చోరీలు చోటుచేసుకోకపోగా ఒక్కరాత్రే మూడు ఇళ్లల్లో చోరీలు చోటుచేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చోరీకి గురైన ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్‌టీం

ఇతర పనులు నిమిత్తం ఇంటికి తాళాలు వేసుకుని వెళ్లిన ఇళ్లల్లోనే చోరీలు జరిగాయి. తాళాలు వేసి ఉండడంపై ముందుగానే ఆయా ప్రాంతాల్లో దొంగలు రెక్కీ నిర్వహించి రాత్రి చోరీలకు పాల్పడినట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పగటిపూట వీధుల్లో సంచరించే గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రివేళల్లో పోలీసుల గస్తీని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కొసమాల మాజీ సర్పంచ్ మృతి


లోకనాథం (ఫైల్)

మెళియాపుట్టి : మండలంలో కొసమాల మాజీ సర్పంచ్ అంకడాల లోకనాథం శుక్రవారం మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడ్డారు. ఈయన రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన పదవీ కాలంలో గ్రామానికి ఎన్నో సేవలు అందించారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతిపై పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పరిశీలిస్తున్న భారతి సౌజన్య

చెత్త సంపద కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం

మండలం పరిధిలోని జె.ఆర్.పురం చెత్త సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య శుక్రవారం పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీ, చెత్త సేకరణ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను, కేంద్రం వద్ద వేరు చేసి తడి చెత్త వర్మీ కంపోస్టుగా తయారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ గోపీబాల, కార్యదర్శులు లక్ష్మణరావు, ఆదినారాయణ, శానిటేషన్ మేస్త్రి ఫణి పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ రజని తదితరులు

బాల్య వివాహాలు సాంఘిక దురాచారం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని సర్పంచ్ నడుకుదిటి రజని, రావాడ పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఎస్.జగన్నాథం నాయుడు అన్నారు. మండలంలోని బంటుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రైమరి పాఠశాల ఆవరణలో శుక్రవారం బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్న వయసులోనే వివాహం చేస్తే జరిగే నష్టాలపై వివరించారు. అనంతరం చిన్నారులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిటిసి టి.సంజీవ్, వార్డు మెంబెర్ గురాల కరుణ, పాఠశాలల హెచ్ఎంలు బి.రమణమూర్తి, జి.సుజన, కోటేశ్వరరావు, పిహెచ్ఎన్ఆర్ రత్నాలు, సిహెచ్ఒ వెంకటలక్ష్మి, అంగన్వాడీ, ఆశవర్కర్స్ జి.హైమవతి, సుజాత, ఎన్.జయలక్ష్మి, టి.రాంబుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రామారావును సత్కరిస్తున్న గ్రామస్తులు, శిష్యులు

సంగీత సారథికి సత్కారం

ప్రజాశక్తి- కవిటి

దశాబ్దాలుగా తన సంగీతంతో ఉద్దానం ప్రజలను అలరిస్తున్న కళాకారుడు బెందాళం రామారావుకు జల్లుపుట్టుగలో ఘన సత్కారం లభించింది. గ్రామస్తులు, రామారావు శిష్యులు కలిసి ఈ ఆత్మీయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పండి దేవేంద్రమూర్తి, ఎన్ని దేవరాజు మాట్లాడుతూ కళారంగానికి రామారావు చేస్తున్న సేవకు ఇది చిరు సత్కారమని అన్నారు. ఆయన నిబద్ధత, త్యాగం ప్రతి కళాకారుడికీ ఆదర్శమని అన్నారు. సంగీత విద్యను గ్రామస్థాయిలోనే అందించి ఎందరో ప్రతిభా వంతులను తీర్చిదిద్దిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శ్రీవాణి గానకళా సమితి సభ్యులు, ఉద్యానవన సంగీత కళాకారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రూ.20 వేల విరాళం

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడకు చెందిన టిడిపి నాయకుడు సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి నౌపడ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల క్రీడా కార్యకలాపాలకు రూ.20 వేలు శుక్రవారం విరాళంగా అందించారు. విద్యార్థుల అభివృద్ధికి ముందడుగు వేసిన ఆయనకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు 2025 సంవత్సరానికి బాపూజీ కళామందిర్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎల్.సూర్యలింగం, లక్ష్మినరసమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యుల సౌజన్యంతో యడ్లపాడుకు చెందిన మానవతా నాటక సంస్థ ఆధ్వర్యంలో జరుగుల రామారావు రచన, దర్శకత్వంలో 'అందరూ మంచివారే కానీ' నాటిక ప్రదర్శన ప్రేక్షకులకు ఆహ్లాదకరంగా, ఆలోచింప చేసే విధంగా ప్రదర్శించారు. అందరూ మంచివారే కానీ నాటికలో మంచి వాళ్ల చేసే తప్పులు మహావిషయదాలకు కారణం అవుతాయి, కొన్నిసార్లు అతి మంచితనంగా వెళ్లడం కూడా ప్రమాదకరమని చెప్పే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

సంఘటనలు ఈనాటిక ప్రదర్శనలో ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదేవిధంగా కుటుంబాలు, జీవన విధానాలు మనం అనుకున్నట్లు ఎల్లప్పుడు ఒకేలా ఉండవని తెలియజేసే సందేశాత్మక ప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శించారు. అదేవిధంగా పన్నాల నరసింహమూర్తి, నారాయణ మూర్తి, రామకృష్ణ సోదరుల సౌజన్యంతో రెండవ నాటిక విజయవాడకు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో వేంపాటి రమేష్ దర్శకత్వంలో 'క్రతువు' నాటిక కూడా ప్రస్తుత పరిస్థితులు, ఇంటి యజమాని బరువు బాధ్యతల్లో, బంధాలు అనుబంధాలు కలుపుకునే సమయంలో జరిగే సంఘటనలు, సాధారణ మానవుల జీవితాల సంఘటనలే ఆధారంగా చేసుకుని క్రతువు నాటికలో అద్భుతంగా ప్రదర్శింపజేశారు. అదేవిధంగా ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ 314 నెలలు రంగస్థలం కళా కారులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పేద కళాకారులకు మరికొంత మందికి పింఛన్లు అందజేయడానికి కృషి చేస్తానన్నారు. విశ్రాంత ఆర్‌డిఒ పి.ఎంజె బాబు మాట్లాడుతూ రంగస్థలం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాటికలు ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో చిట్టి నాగభూషణం, గొండు స్వాతి, రంగస్థల కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, రామచంద్రదేవ్, కంచరన్న అప్పారావు, చిట్టి వెంకటరావు, గజల్ వాసుదేవాచారి, ఇంజరాపు రమణారావు, బి.ఎ. మోహనరావు, బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

నిర్వాసితులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితులకు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీష నగదు పంపిణీ చేశారు. రేగులపాడుకు చెందిన కొంత మంది నిర్వాసితులకు వివిధ రకాల కారణాలతో నష్టపరిహారం చెల్లించలేకపోవడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి ఐదు మంది నిర్వాసితులకు రూ.5 లక్షలు నష్టపరిహారం అందించామని అన్నారు. నివాస గృహాలు ఖాళీ చేయించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఆర్ఐ ప్రసాదరావు, వంశధార ఎఇ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ఎమ్మెల్యేకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు

నరసన్నపేట : ఈ నెల 7న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జన్మదినం సందర్భంగా మాబగం స్వగ్రామంలో టిడిపి నాయకులు శుక్రవారం ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమణమూర్తి, సుగన దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించి కేక్ కట్ చేశారు. అలాగే జన్మదిన కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి రావాడ కృష్ణ, పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, నీటి సంఘం అధ్యక్షులు శిమ్మ లక్ష్మణరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతి, సభ్యులు బగ్గు రవికుమార్, కోల తిరుమల పాల్గొన్నారు.

అభినందిస్తున్న తులసీదాస్‌రెడ్డి

స్వర్ణభారతి విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం : విజయవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి రోలర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో స్వర్ణభారతి స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. యోగేష్, సంతోష్ దొర, మధు మోహన్, కౌశిక్‌లను స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మెన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి శుక్రవారం అభినందించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మహేశ్వరి, స్కేటింగ్ కోచ్ చంద్రావతి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. భవిష్యత్‌లో నిర్వహిస్తున్న అన్ని పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాక్షించారు.

మాట్లాడున్న కృష్ణంనాయుడు

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక ఎంపిడిఒ సమావేశ మందిరంలో నరసన్నపేట పట్టణ కాళింగ సంక్షేమ సంఘం మూడో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అలాగే నూతనంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షల సమక్షంలో అధ్యక్షునిగా ఉప్పాడ పూర్ణారావుని ఎన్నుకున్నారు. ముందుగా కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడు మాట్లాడుతూ నరసన్నపేట కాళింగ సంక్షేమ సంఘం సేవా కార్యక్రమాలు చేయడంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండడాన్ని అభినందించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు, వైద్యులు బలగ మురళి, మార్పు విజయకుమార్, సనపల సోమేశ్వర రావు, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ సేవా పథకంలో భాగంగా మండలంలోని మహర్తాపురం, కుంటిభద్ర గ్రామాల్లో వాలంటీర్లతో కలిసి శుక్రవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు జి.మహేష్, కె.హరిప్రసాద్, పి.చిరంజీవి, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోవిందపురం కళాశాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. జాతీయ సేవా పథకం వాలంటీరుల ఐదు రోజులుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాగోలు జెమ్స్ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ సేవ పథకం ద్వారా ఐదు రోజులుగా గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించి, వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్థానిక నాయకులు కళాశాల సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

సందర్భంగా వైద్య సిబ్బంది 326 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి కె.రమణ, టిడిపి నాయకులు గోవింద పాపారావు, గాడ అఖిల్, కొనారి కిరణ్, చింత నారాయణ, తుమ్మల కృష్ణారావు, సైనీ బాలాజీ, ప్రిన్సిపాల్ రమేష్, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రూప్ సుందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర స్థాయిలో జరిగిన హ్యాండ్ బాల్ అండర్ -19 విభాగంలో తొగరాం హైస్కూల్ విద్యార్థులు జిల్లా జట్టు తరుపున పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లా జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన పాఠశాలకు చెందిన విద్యార్థులు బంటుపల్లి అనుష్క, అన్నెపు అనూష, మనీషా, తమ్మినేని దివ్య, కూన కార్తీక్, రామ్ చరణ్, ఢిల్లీశ్వరరావు, సతీష్, గుణశేఖర్‌లను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఎం.పోలినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి కె.ఆర్.రజని

ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థులు ప్రణాళికాబద్ధమైన విద్యను అభ్యసించినప్పుడే ఉన్నతస్థాయి కొలువులను సాధించగలరని డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.ఆర్.రజని అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.సిహెచ్.మధుసూదనరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పదం, సామాజిక భావనలు, వినయ విధేయతలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా నవసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధమైన లక్ష్యసాధనకు శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎసిఎల్ జనరల్ మేనేజర్ కె.శ్యాంప్రసాద్, సిమెచ్‌సి సూపరింటిండెంట్ డా.పి.సుజాత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.ఇందిర, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న విప్ అశోక్

బోరువెల్ ఏర్పాటు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సామాజిక బాధ్యతగా రిత్విక్ గోల్డ్ ప్రైవేటు లిమిటెడ్ ఫౌండేషన్ అందించిన వాటర్ బోర్ వెల్ దాత పైడిశెట్టి దినేష్ కుమార్‌కు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అభినందించారు. మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురంలోని ఎపి మోడల్ స్కూల్లోను, మండలంలోని ధర్మపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాటర్ ప్రాజెక్టులను శుక్రవారం ప్రారంభించారు. దినేష్‌కుమార్ తన తండ్రి రవికుమార్ స్మారకార్థం వాటర్ బోర్ వెల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుంపల వైకుంఠరావు, ఎంఇఒ అప్పారావు, తహశీల్దార్ వెంకటరావు, ఎస్ఎంసి చైర్మన్ తిప్పిన దుర్యోధనరెడ్డి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, పట్టణ టిడిపి అధ్యక్షులు పత్రీ తవిటయ్య, కార్యదర్శి నందిగాం కోటి, లీలారాణి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుజాత

ఆధార్ శిబిరాలు వినియోగించుకోవాలి

లావేరు: ఆధార్‌కార్డుల్లో తప్పుల సవరణలకు ప్రభుత్వం గ్రామాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత సురేష్ సూచించారు. మండలంలోని తాళ్లవలస సచివాలయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్‌కార్డు సమస్యలున్న ప్రతిఒక్కరూ గ్రామస్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయలక్ష్మి, డిజిటల్ అస్టెంట్ దీపిక, ఎహెచ్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

కొత్తూరు: మండలంలోని కడుమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి, టి.హోమ్స్ ఎండి నెయ్యిగాపుల వైకుంఠరావు సైకిల్ షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును ప్రధానోపాధ్యాయులు గొర్లె తిరుమలరావు శుక్రవారం అందజేశారు. అనంతరం వైకుంఠరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రామారావు, ఎంపిటిసి వలరౌతు గోవిందరావు, మాజీ సర్పంచ్ వి.ధర్మారావు, ఎస్ఎంసి చైర్మన్ బి.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

జగన్నాయకులు పరామర్శ

సంతబొమ్మాళి: మండలంలోని బృందావనంకు చెందిన వైసిపి టెక్కలి నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు గేదెల చంద్రరావును వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కెల్లి జగన్నాయకులు శుక్రవారం పరామర్శించారు. చంద్రరావు కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తెలుసుకుని ఎంపిపి ప్రతినిధి మీరు అప్పారావుతో కలిసి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డి.జి.పురం సర్పంచ్ మార్పు నాగభూషణం, సర్పంచ్ కోత ఇందిర, పప్పు జగ్గారావు, కూరాకుల సుబ్బారావు పాల్గొన్నారు.

28న ఆత్మీయ కలయిక

శ్రీకాకుళం సిటీ: ఈ నెల 28న ఎచ్చెర్లలోని పాత జాతీయ రహదారికి అనుకుని కేశవరెడ్డి పాఠశాల సమీపంలోని తోటల్లో కాళింగ సమాజిక తరగతి ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. నగరంలోని కుశాలపురం సింహద్వారం సమీపంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. సామాజిక తరగతికి చెందిన ప్రతిఒక్కరూ హాజరై విజయ వంతం చేయాలన్నారు. సామాజిక తరగతి ప్రగతిపై చర్చించనున్నట్లు చెప్పారు.

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని గుర్తించాలి

నరసన్నపేట: విద్యార్థుల్లోని నైపుణ్యాభివృద్ధినిక గుర్తించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. నరసన్నపేట డిగ్రీ కళాశాలలో జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు మెరకు కెరీర్ ఒపినియన్, డెయిర్ ఒపినియన్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు శైలజ ఎంపిక

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కెజిబివిలో చదువుతున్న ఇంటర్ సెకండియర్ గుమ్మడి శైలజ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైంది. గత నెల విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 12 నుంచి 17 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. ఈ మేరకు అలియన్స్ క్లబ్ సభ్యులు స్పోన్సర్ బత్తుల వెంకటరమణ శుక్రవారం సురంగిరాజా మైదానంలో ఆ విద్యార్థినికి అభినందించి రవాణా ఖర్చుల కోసం ఆర్థికసాయం, స్విమ్మింగ్ డ్రస్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఉమాశంకర్, వెంకటరావు, మాజీ అధ్యక్షులు ఎల్.నరసింహమూర్తి, బి.వెంకటరమణ, క్లబ్ సభ్యులు యోగి, కె.నరసింహమూర్తి, సిహెచ్.వెంకటరమణ, బాల, కామరాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని అక్కివరం పంచాయతీలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులను టిడిపి నాయకుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు తాండ్ర హరిబాబు చేతులమీదుగా శుక్రవారం అందించారు. గత నెలలో మొంథా తుపాను కారణంగా చేనేత కార్మికులకు ప్రభుత్వం బియ్యం, కందిపప్పు, నూనె, పంచదార, ఇతర నిత్యవసర సరుకులను అందించింది. మొదటి విడతలో కొద్దిమందికే నిత్యవసర సరుకులు అందడంతో చాలామంది చేనేత కార్మికులు నిస్సహాయత వ్యక్తం చేశారు.

చేనేత కార్మికులకు సరుకులు అందజేస్తున్న హరి

పలువురు విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే రవికుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా అధికారులు రెండో విడతలో 15 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు నిత్యవసర సరుకులను రేషన్ దుకాణాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ జి.సన్యాసిరావు, చేనేత కార్మికులున్నారు.

మాట్లాడుతున్న భైరాగినాయుడు

రైతులకు చేసిందేమిటి?

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతన్న మీకోసం కార్యక్రమం అంతా ప్రచార ఆర్భాటమే తప్ప అన్నదాతకు ఒరిగేది ఏమీ లేదని పోలాకి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దీర్ఘాశిలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమం టిడిపి కార్యకర్తల సమావేశంలా ఉందని విమర్శించారు. ఒక్క యూరియా బస్తా కోసం పడిగాపులు కాసినా సందర్భం ఇంకా రైతులు మర్చిపోలేదని గుర్తు చేశారు. దళారుల కోసమే కూటమి ప్రభుత్వమని పేరుమార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి చింత రాఘవరావు, వైసిపి మండల ఉపాధ్యక్షుడు రావాడ అప్పన్నరాజు, ప్రధాన కారదర్శి ఎం.వి.వి.ప్రసాద్ (చిట్టి) పాల్గొన్నారు.

మత్స్యకారులకు బియ్యం మంజూరు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మొంథా తుపాను కారణంగా ప్రభుత్వం వేటకు వెళ్లరాదని ప్రకటించడంతో మత్స్యకారులు ఐదురోజుల పాటు వేటకు వెళ్లలేదు. జీవన భృతిని ప్రభుత్వం ఇస్తుందని ప్రకటించింది. దీంతో వారందరికీ 50 కేజీల బియ్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అర్హత ఉన్న వారు, జాబితాలో లేని వారికి కూడా ఇవ్వాలని వారంతా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వినతని అందజేశారు. మంత్రి స్పందించి అర్హులందరికీ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. దీంతో నియోజకవర్గంలో 11 మత్స్యకార గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుంది. 4030 మంది కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, మంత్రి ప్రత్యేకచొరవతో వారందరికీ 50 కేజీల బియ్యం మంజూరైంది. బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. త్వరితగతిన పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తమ వినతిని పరిగణలోకి తీసుకొని మంజూరు చేయడంపై మంత్రికి మత్స్యకార కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వజీవులకు మట్టే ఆధారం

సరుబుజ్జిలి : మొక్కలు నాటుతున్న రెడ్డీస్ ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సర్వజీవులకు మట్టే ఆధారమని, నేలతల్లిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు కొంక్యాన మురళీ మోహన్, గేదెల ఇందిరా ప్రసాద్, శాసపు జోగినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం, అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి లేకపోతే ఆహారం లేదని, ఆహారం లేకపోతే జీవం లేదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మీ, గుడ్ల జగ్గారావు, డి.కృష్ణారావు, సుగంధం సంజీవరావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు, మెట్ట భట్లు, తిరుపతిరావు, నల్లాబాటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మానవ మునుగడకు ఉపయోగపడే నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త అత్తులూరి లావణ్య అన్నారు. మండలంలోని వెన్నెలవలస గిరిజన గ్రామంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం వేడుకలను నిర్వహించారు. గిరిజన గ్రామ సముదాయాల పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటించారు. ప్రధానోపాధ్యాయులు మోహనరావు, రైతులు గిరి, సుధాకర్, అప్పారావు, మనోజ్, విజయ్‌పాల్గొన్నారు.

పనులు వేగవంతం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పట్టు మహాదేవ కోనేరు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టు మహాదేవ కోనేరు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తికి పలు సూచనలు చేశారు. అలాగే వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయానికి కోనేరుకు సంబంధం లేకుండా నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

లోపల నీరును తొలగించి సింక్ తొలగించాలని ఆదేశించారు. గట్టుపై చుట్టూ సిసి రోడ్డు నిర్మించి రన్నింగ్ వాక్ మార్గాలన్నారు. రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటాలని అన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అరసవల్లి: ప్రపంచ మృత్తికా దినోత్సవం సందర్భంగా సిక్కోలు హరిత మహోత్సవ ర్యాలీ, పోస్టర్ విడుదల శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సిక్కోలు హరిత మహోత్సవం - 25 పోస్టర్‌ను విడుదల చేశారు. ఉద్యానవన, అటవీ, పశువైద్య, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ మహోత్సవ ర్యాలీలో వైద్యులు కుర్మాన వినోద్ కుమార్, డాక్టర్ వి.సుచిత్ర, డాక్టర్ ఎస్.జ్యోత్స్న, బి.వి.రవిశంకర్ పాల్గొన్నారు.

విత్తనాలను పంపిణీ చేస్తున్న మోహనరావు

వేరుశనగ విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పట్టుపురం సచివాలయంలో శుక్రవారం వేరుశనగ విత్తనాలను పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహన్‌రావు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సమయానుకూలంగా విత్తనాలను అందజేయడం ద్వారా పంటల దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.దానకర్ణుడు, ఎఎంసి చైర్మన్ ప్రతినిధి భైరసింగి దినకర్, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ సిలార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అండ

కవిటి: అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడి గొండ్యాలపుట్టుగకు చెందిన బైరెడ్డ రమేష్ కుటుంబానికి దాతలు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా 2012-13 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల శుక్రవారం రమేష్ భార్య మోహినిని పరామర్శించారు. తమవంతుగా రూ.5,100 అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అలుపెరుగని కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ఆసరా సంస్థ అలుపెరుగని కృషి చేస్తుందని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ అన్నారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆసరా సంస్థ ప్రచురించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద ఆర్గనైజేషన్‌గా ఆసరా అవతరించిందని, దేశ వ్యాప్తంగా వినియోగదారులకు అవగాహన కల్పించడంలో ఆసరా సంస్థ ముందు వరసలో నిలిచిందన్నారు. ఈనెల 6న విజయవాడలో జాతీయ సెమినార్ జరుగుతుందని, దీనికి సంబంధించి పోస్టర్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆసరా ప్రతినిధులు

ఆవిష్కరణ చేశామన్నారు. కార్యక్రమంలో ఆసరా సంస్థ ప్రతినిధులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, కె.పి.సారధి, స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, గుడ్ల జగ్గారావు, గేదెల లక్ష్మీ, సుగంధం సంజీవరావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత, హెచ్‌ఆర్ పాలసీ, విశ్రాంత వయసు 62, హెల్త్ స్కీమ్ కల్పించాలని కోరారు. అచ్చెన్నాయుడు స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో హెచ్.రాజకుమార్, పి.ఎర్రన్న, డి.రవికుమార్, ఆర్.సంతోషి, కె.తిరపతి, ఎన్.మల్లేశ, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.